క్లుప్తంగా

గౌరమ్మకు విశేష పూజలు



తంబళ్లపల్లె : మల్లయ్యకొండపై గల గౌరమ్మగుట్టలో వెలసిన గౌతమ్మతల్లి ఆలయంలో శుక్రవారం మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారి శేఖర్ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉపవాసంతో వచ్చిన మహిళలకు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. మన రాష్ట్రం నుంచే కాకుండా కర్ణాటక నుంచి భక్తులు వచ్చారు. దేవస్థానం వారు ఉచిత అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఈశ్వరప్ప, మల్లికార్జున పాల్గొన్నారు.

మూలస్థానమ్మకు ప్రత్యేక అలంకరణ



కేవీపల్లె : మండలంలోని గర్నిమిట్ట పంచాయతీ వంకాటపల్లెలో వెలసిన శ్రీ మూలస్థానమ్మకు శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. శుక్రవారం మూలస్థానమ్మ జాతర ప్రారంభమైంది. రెండు రోజుల పాటు జరిగే జాతరలో భాగంగా అమ్మవారికి అభిషేకాలు, అలంకరణ, ప్రత్యేక పూజలు చేపట్టారు. శనివారం ఉదయం నుంచి వంకాటపల్లె, పోతిరెడ్డిగారిపల్లె, చింతమాకులపల్లెలో ఊరేగింపు చేపట్టనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రాత్రి చాందినీ బండ్లు ఆలయ ప్రదక్షిణ ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో రమణారెడ్డి, రామసుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సుభద్ర కల్యాణం



హరికథ చెబుతున్న శారద

కలకడ : మహాభారత యజ్ఞంలో భాగంగా శుక్రవారం ప్రదర్శించిన సుభద్ర కల్యాణం హరికథ భక్తులను ఎంతో ఆకట్టుకుంది. మండలంలోని నడిమిచెర్ల గ్రామంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహాభారత యజ్ఞం నాలుగవ రోజు సుభద్ర కల్యాణం కథను భాగవతారిణి ఎ.శారద చెప్పారు. 18 రోజుల పాటు కొనసాగనున్న ఈ యజ్ఞంలో భాగంగా రాత్రి నాటకాలు పీలేరుకు చెందిన శ్రీవెంకటేశ్వరనాట్యకళామండలి సభ్యులు 21వ తేదీ వరకు కొనసాగించనున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని శ్రీ ద్రౌపతి మాత కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.


ఇంటి వద్దకే వైద్య సేవలు



ఇంటి వద్ద వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ మునికుమార్

తంబళ్లపల్లె : ప్రభుత్వం అమలు పరుస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో మారుమూల పల్లెల్లో కూడా ఇంటి వద్దకే వైద్యసేవలు అందుతున్నాయి. శుక్రవారం కోసువారిపల్లె పీహెచ్‌సీ పరిధిలోని బాలిరెడ్డిగారిపల్లె పంచాయితీలో డాక్టర్ మునికుమార్ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాలలో వృద్ధులకు, పలువురికి బీపీ, షుగర్ వంటి పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో రమణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సమన్వయంతో ఏఎంసీ అభివృద్ధి



సిబ్బందికి వేతనం అందజేస్తున్న జేసీఎం డైరెక్టర్ రవీంద్ర

మదనపల్లె సిటీ : ఆరోగ్యవరం మెడికల్ సెంటర్ (ఏఎంసీ)ను అందరితో కలిసి అభివృద్ధి చేస్తామని ఏఎంసీ నూతన మెడికల్ డైరెక్టర్ డాక్టర్ కేసీ రవీంద్ర అన్నారు. శుక్రవారం ఆరోగ్యవరం మెడికల్ సెంటర్‌లో 130 మంది ఉద్యోగులకు రూ.15 లక్షల వేతనంతోపాటు తొలి నెల బోనస్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమ డయాసిస్ బిషప్ ఐజాక్‌ప్రసాద్ సూచనలతో ఏఎంసీలో రోగులకు మెరుగైన చికిత్సలు అందిస్తామన్నారు. సిబ్బంది సహాయ సహకారాలతో అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో జేసీఎం డివిజన్ సంఘ కాపరి సునిల్‌వరకుమార్, నాన్సి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి ప్రాధాన్యం



బహిరంగ సభలో పాల్గొన్న డ్వాక్రా మహిళలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

- వైఎస్సార్ ఆసరా బహిరంగ సభలో ఎమ్మెల్యే నవాజ్‌బాషా
- జగనన్నకు మద్దతుగా నిలిచి ఆశీర్వదించండి
- సంక్షేమ పాలనను ఓర్వలేని ప్రతిపక్షాలు

నిమ్మనపల్లె : మహిళా సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మదనపల్లె ఎమ్మెల్యే నవాజ్‌బాషా తెలిపారు. శుక్రవారం నిమ్మనపల్లె జెడ్పీ హైస్కూల్ మైదానంలో ఎంపీపీ నరసింహులు అధ్యక్షతన వైఎస్సార్ ఆసరా మూడవ విడత నిధుల పంపిణీ బహిరంగ సభ జరిగింది. డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిపక్ష నేతగా ప్రజాసంకల్పయాత్ర చేసి ప్రజల కష్టాలు తెలుసుకుని రెండు పేజీల మేనిఫెస్టోతో అధికారంలోకి వచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 90 శాతంపైగా అమలు చేసిన రాష్ట్రం దేశంలో కేవలం ఆంధ్రప్రదేశ్ అన్నారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం అని చెప్పుకొనే మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు తన హయాంలో ఇన్ని సంక్షేమ పథకాలు ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. పసుపు కుంకుమ పేరుతో డ్వాక్రా మహిళలను మోసం చేసే ప్రయత్నం 2019 ఎన్నికల సమయంలో చేయగా వారు చంద్రబాబుకు తగిన బుద్ధి చెప్పారన్నారు. అయినా మరోసారి ఎల్లో మీడియా సహకారంతో ప్రభుత్వంపై బురదజల్లే కార్యక్రమం చేస్తున్నారన్నారు. ప్రతిపక్ష నాయకులు సృష్టించే అసత్య ప్రచారాలను నమ్మొద్దని తెలిపారు. సంక్షేమ పాలన కొనసాగాలన్నా, రాష్ట్రం అభివృద్ధి పయనంలో ముందుకెళ్లాలన్నా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. అక్కాచెల్లెమ్మలు అందరూ జగన్ మోహన్‌రెడ్డికి మద్దతు తెలపాలని కోరారు. నిమ్మనపల్లె మండలంలో 591 డ్వాక్రా సంఘాలు ఉండగా 5112 మంది డ్వాక్రా సంఘ సభ్యులకు రూ.5,12,86,592 కోట్లు నిధులు నేరుగా వారి బ్యాంకు ఖాతాలకు జమ చేయడం జరిగిందన్నారు. మూడు విడతల్లో రూ.15.37 కోట్లు డ్వాక్రా మహిళలకు ప్రభుత్వం అందజేసినట్లు తెలిపారు. మదనపల్లె నియోజకవర్గానికి మెడికల్ కాలేజీ మంజూరు చేశామని, మదనపల్లె - తిరుపతి నాలుగు లైన్ల రోడ్డు విస్తరణ చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం డ్వాక్రా సంఘాలకు మెగా చెక్‌ను అందజేశారు. అంతకుముందు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మదనపల్లె మున్సిపల్ వైస్ చైర్మన్ జింకా వెంకటాచలపతి, సింగల్‌విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్‌రెడ్డి, ఆర్బీకే చైర్మన్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఎంపీడీవో లీలా మాధవి, ఏపీఎం రజనీకుమారి, మండల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గారబురుజు రమణారెడ్డి, మండల సచివాలయాల చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ రాజంపేట ప్రధాన కార్యదర్శి కొమ్మేపల్లె శ్రీనివాసులురెడ్డి, యుగంధర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, తహసీల్దార్ ఆర్.మంజుల, వైస్ ఎంపీపీలు జయప్రకాష్ రెడ్డి, సుజాత, సర్పంచులు సుబ్రహ్మణ్యం, మహదేవరెడ్డి, చంద్రాయుడు, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

భక్తుల కొంగు బంగారం గర్నిమిట్ట యల్లమ్మ



యల్లమ్మ అమ్మవారు



విద్యుద్ కాంతులతో ఆలయం

- నేటి నుంచి జాతర
- చురుగ్గా ఏర్పాట్లు

కేవీపల్లె : మండలంలోని గర్నిమిట్టలో వెలసిన గ్రామ దేవత శ్రీ యల్లమ్మ అమ్మవారు భక్తుల కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా విరాజిల్లుతున్నారు. ఏటా మొలకల పౌర్ణమి (బుద్ధపౌర్ణమి) అనంతరం వచ్చే ఆదివారం యల్లమ్మ అమ్మవారి జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా ఈ ఏడాది శనివారం నుంచి సోమవారం వరకు మూడు రోజుల పాటు అంగరంగవైభంగా జరుగనుంది. గర్నిమిట్ట యల్లమ్మకు ఓ చరిత్ర ఉందని స్థానికులు కథలుగా చెబుతున్నారు. స్థానికుల కథనం మేరకు... మూడు వందల సంవత్సరాల క్రితం గర్నిమిట్ట కస్పాలో శ్రీనివాసాచార్యులు, బాలయ్యశెట్టిలు స్నేహితులుగా ఉండేవారు. శ్రీనివాసాచార్యులకు పశువుల పాక ఉండేది. అక్కడ పశువులకు ప్రతి రోజూ పశుగ్రాసం వేస్తుండే వాడు. ఒక రోజు పశుగ్రాసం వేసే గాటిలో ఓ నల్లటి రాయి కనిపించింది. ఆ రాయిని తీసి బయట పడవేశాడు. మరుసటి రోజు తిరిగి యథాస్థితికి చేరుకోవడంతో శ్రీనివాసాచార్యులు ఆశ్చర్యపోయాడు. ఆ రోజు కూడా రాయిని బయట పడవేయగా, మరుసటి రోజు తిరిగి గాటిలో ప్రత్యక్షమైంది. వారం రోజులు ఇలా జరిగిన అనంతరం ఆ రాయిని బలంగా గోడకేసి కొట్టాడు. అయితే ఆ రాయి నుంచి రక్తపు మరకలు రావడంతో ఇదేదో మాయగా ఉందని భావించాడు. అదేరోజు రాత్రి గ్రామంలో ఓ మహిళకు దేవత కలలో కన్పించి నేను ఓ బ్రాహ్మణుడికి ప్రత్యక్షమైతే పట్టించుకోవడం లేదని, నన్ను గ్రామ దేవతగా కొలిస్తే గ్రామ ప్రజలను చల్లగా కాపాడు తానని చెప్పింది. దీంతో ఆ మహిళ విషయాన్ని శ్రీనివాసాచార్యులకు తెలిపింది. శ్రీనివాసాచార్యులు అతని స్నేహితుడు బాలయ్యశెట్టితో కలసి గర్నిమిట్ట గ్రామంలో ఓ గుడిని నిర్మించి ఆ రాయిని గుడిలో ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి యల్లమ్మ అమ్మవారిగా కొలుస్తూ ప్రతి ఏటా జాతర నిర్వహిస్తున్నారు.

భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు

గర్నిమిట్ట యల్లమ్మ అమ్మవారి జాతర శనివారం నుంచి మూడు రోజుల పాటు జరుగుతుందని ఆలయ చైర్మన్ రామసుబ్బమ్మ తెలిపారు. శనివారం రాత్రి భక్తులు జాగారం, ఆదివారం రాత్రి బోనాల సమర్పణ, చాందినీబండ్లు ఊరేగింపు, సోమవారం మొక్కుబడుల చెల్లింపు కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు, క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

మదనపల్లె సిటీ : మదనపల్లె పట్టణంలోని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల (బాలుర)లో 2023 - 2024 విద్యా సంవత్సరానికిగానూ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.రంగనాయకులు తెలిపారు. పాఠశాలలో మూడవ తరగతికి కేటాయించిన 40 సీట్లలో ఎస్టీలకు 31 సీట్లు, ఎస్సీలకు 5 , బీసీలకు 2, ఓసీలకు 1 సీటు, ఏఈక్యూలో ఒక సీటు కేటాయించినట్లు ఆయన పేర్కొన్నారు. నాలుగవ తరగతిలో 35 సీట్లు ఐదో తరగతిలో 26, అరవ తరగతిలో 12, ఏడవ తరగతిలో 4, ఎనిమిదవ తరగతిలో 3, తొమ్మిదో తరగతిలో ఒక సీటు ఖాళీగా ఉన్నాయన్నారు. నాలుగవ తరగతి నుండి తొమ్మిదవ తరగతి వరకు గల ఖాళీ సీట్లలో కేవలం ఎస్టీ విద్యార్థులతో మాత్రమే నింపుతామని తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 30వ తేదీ ఆఖరు తేదీ అని, మరిన్ని వివరాలకు 9490601554 నెంబరును సంప్రదించాలన్నారు.

ఆకాశమే హద్దుగా ఎదగాలి



మిట్స్ కళాశాల అశ్వ ఫెస్టివల్‌లో జ్యోతి వెలిగిస్తున్న సినీ హీరో సత్యదేవ్

కురబలకోట : 'యువత మూస పద్ధతి వీడాలి.. మేధస్సుకు పదును పెట్టాలి.. ఉన్నత లక్ష్యంతో చదువు సంధ్యలు సాగించి పది మందికి ఉపాధి, ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలి' అని సినీ హీరో సత్యదేవ్ తెలిపారు. శుక్రవారం రాత్రి అంగళ్లలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన అశ్వ-23 ఫెస్టివల్‌లో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోటీ ప్రపంచం ఆపై సాంకేతిక యుగంలో ఎవరు.. ఎక్కడైనా రాణించవచ్చన్నారు. ఇందుకు టాలెంట్, సమయపాలన, ఆత్మ విశ్వాసం ఉంటే ఆకాశమే హద్దుగా ఎదగవచ్చన్నారు. రాజకీయాల్లో ఉన్న వారు మాత్రమే నాయకులు కాదన్నారు. ప్రజలను సమీకరించి దిశా నిర్దేశం చేసి ప్రేరణ కల్గించి సమష్టి లక్ష్యాన్ని సాధించే ప్రతి ఒక్కరూ సామాజిక నాయకుడు, నాయకురాలేనన్నారు. ముందుగా మానవ అవసరాలకు తగిన నూతన ఆవిష్కరణలను గుర్తించాలన్నారు. సాంకేతిక యుగంలో అవకాశాలకు కొదవలేదన్నారు. ప్రపంచంతో పోటీ పడవచ్చన్నారు. ఉపాధి ఉద్యోగాలు కల్పించడం ద్వారా సమాజంలో కీర్తింపబడవచ్చన్నారు. వ్యాపార సంస్థలు, పరిశ్రమలు స్థాపించి ప్రగతి సాధించాలనుకునే వారు ముందుగా నాయకత్వ లక్షణాలను కల్గి ఉండాలన్నారు. ఆత్మవిశ్వాసం, బాధ్యత, నిర్ణయాత్మక శక్తి, అంకిత భావం, విశ్వసనీయత, నైపుణ్యాలు, ఒత్తిళ్ల నియంత్రణ, సామాజిక బంధాలు, మార్కెటింగ్‌పై అవగాహన, సానుకూల దక్పథం ఉన్న వారు ఏరంగంలోనైనా రాణిస్తారన్నారు. వ్యక్తి వ్యవస్థగా మారుతాడన్నారు. ఇలాంటి వారికి విజయం కూడా వంగి దారి ఇస్తుందన్నారు. విద్యార్థులు క్రమ శిక్షణతో చదువు సంధ్యలు సాగించి కలలు సాకారం చేసుకోవాలన్నారు. కళాశాలలోనే భవిష్యత్ ప్రణాళికకు పునాది పడాలన్నారు. టాలెంట్ ఉన్న వారి కోసం వివిధ కార్పొరేట్ కంపెనీలే వెంటపడతాయన్నారు. కళాశాల విద్యార్థులు ప్రపంచ నలుమూలల ఉద్యోగాల్లో రాణించగలుగుతున్నారన్నారు. కష్టపడి చదివే విద్యార్థులు ఇతరులకు మంచి పుస్తకంలా మోడల్‌గా ఉంటారన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి చేరాలన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన వివిధ డ్యాన్సులు పలువురిని ఆకట్టుకోవడంతోపాటు ఉర్రూతలూగించాయి. స్టెప్పులతో కెవ్వుకేకమనిపించారు. మైదానంతోపాటు పరిసర ప్రాంతాలు కేకలు, కేరింతలతో మారుమోగాయి. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్త నాదేళ్ల, ద్వారకనాథ్, ప్రిన్సిపాల్ యువరాజ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెద్దతిప్పసముద్రం : మండలంలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని డిస్కం ఏఈ ఉత్తన్న తెలిపారు. సబ్ స్టేషన్లలో మరమ్మతులు ఉండటంతో విద్యుత్‌కు అంతరాయం ఉంటుందని మండల ప్రజలు, దుకాణాదారులు, రైతులు సహకరించాలని ఆయన సూచించారు.

పథకాలు పారదర్శకంగా అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ హబీబ్‌బాషా

పీలేరు : ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా అందించాలని సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా అన్నారు. శుక్రవారం బాపూజీనగర్‌లో వీవో లీడర్లు, గ్రామసచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు సక్రమంగా చేరేలా సహకరించాలని కోరారు. అర్హత ఉండి ఇంకా ఏవైనా పథకాలు అందకుండా ఉంటే అలాంటి వారిని గుర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈవో రెడ్డిప్రసాద్‌రెడ్డి, సీసీ నరసింహరెడ్డి, శానిటరీ ఇన్స్‌పెక్టర్ రవికుమార్, వార్డు మెంబరు సతీష్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించండి



రోడ్డు భద్రతా అద్దాలు ఏర్పాటు చేస్తున్న ఎస్సై నాగేశ్వరరావు

వాల్మీకిపురం: రోడ్డు ప్రమాదాలు జరగకుండా రోడ్డు భద్రతా అద్దాలను ఏర్పాటు చేసినట్లు ఎస్సై నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని గాంధీ బస్టాండ్, ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో రోడ్డు భద్రతా అద్దాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రోడ్డు భద్రతా నియమాలను ప్రతి వాహనదారుడు పాటించాలని సూచించారు. ప్రతి ద్విచక్రవాహదారుడు హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీటు బెల్టు పెట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గంగ జాతర



బోనాలు ఊరేగింపుగా తీసుకొస్తున్న మహిళలు



ఆలయం వద్ద మొక్కులు చెల్లిస్తున్న మహిళలు

నిమ్మనపల్లె : మండల పరిధిలోని ముస్టూరు పంచాయతీ ఎర్రప్పగారిపల్లెలో గంగజాతర ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలందరూ శనివారం తెల్లవారుజామున గ్రామదేవతలకు దివ్వెలు, బోనాలను మేళతాలాలు, డప్పు వాయిద్యాలతో కోలాహలం నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లారు. గ్రామ దేవతలైన బోయకొండ గంగమ్మ, నల్లవీరగంగమ్మ, మారెమ్మ ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు బంధుమిత్రులకు విందు భోజనాలు ఏర్పాటు చేశారు. ప్రతి మూడేళ్లకు ఒక్కసారి నిర్వహించే ఈ గంగజాతర, కరోనా కారణంగా ఐదేళ్ల తర్వాత ఘనంగా జరిపారు. చివరగా 2019వ సంవత్సరంలో గంగజాతర చేయగా 2021లో కరోనా కారణంగా జాతర చేయకుండా ఆపివేశారు. ఐదేళ్ల తర్వాత గంగజాతర నిర్వహించడంతో గ్రామంలో బంధుమిత్రుల రాకతో సందడిగా ఏర్పడింది. మదనపల్లె మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి, నియోజకవర్గ స్థాయిలో పలువురు ప్రముఖులు గంగ జాతరకు హాజరయ్యారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి



ర్యాలీ ప్రారంభిస్తున్న డీఎస్పీ కేశప్ప

మదనపల్లె : జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని మదనపల్లె డీఎస్పీ కె.కేశప్ప అన్నారు. జాతీయ మెగా లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని కోరుతూ పట్టణంలో శుక్రవారం ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ శనివారం జరిగే లోక్ అదాలత్‌లో ఎలాంటి ఫీజులు లేకుండా రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కరించుకోవచ్చునన్నారు. లోక్‌అదాలత్ ద్వారా ఎంతో మంది కేసులు రాజీ చేసుకుని సత్వర న్యాయం పొందారని తెలిపారు. కార్యక్రమంలో టు టౌన్ సీఐ మురళీకృష్ణ, ఎస్‌ఐలు లోకేష్‌రెడ్డి, హరిహరప్రసాద్, రామాంజనేయుడు, జ్ఞానాంబిక డిగ్రీ కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

పీలేరు : స్థానిక కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని సీఐ మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి వివిధ సంఘాలతో కలసి పోలీస్ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులను కక్షిదారులు రాజీ మార్గంలో పరిష్కరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ రమణ, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కలకడ : వాల్మీకిపురం జూనియర్ సివిల్ కోర్టులో శనివారం జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు ఎస్‌ఐ సిటి స్వామి తెలిపారు. చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై కలకడలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, ఆటో యూనియన్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా నర్సుల దినోత్సవం



వాల్మీకిపురం: నైటింగేల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైద్యులు, నర్సులు

వాల్మీకిపురం : అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని శుక్రవారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రభుచరణ్ మాట్లాడుతూ 1854లో క్రిమియా యుద్ధంలో టర్కీలో గాయపడిన సైనికులకు నైటింగేల్ అందించిన సేవలను కొనియాడారు. నైటింగేల్ గౌరవార్థం ఆమె పుట్టిన రోజును అంతర్జాతీయ నర్సుల దినోత్సవంగా జరుపుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం నర్సులకు స్వీట్లు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ ఫైరోజా బేగం, డాక్టర్లు సోని, లేఖ్య, హర్షిత రెడ్డి, శ్రీలక్ష్మి, నర్సులు గోవిందమ్మ, సర్తాజ్, సుజాత, సునీత, రాణెమ్మ, లావణ్య, శ్రీలక్ష్మి, స్వప్న ప్రియ, సిబ్బంది సుధాకర్, భాస్కర్, బాబా సాబ్, తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లె : ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించడంలో నర్సులపాత్ర ప్రశంసనీయమని డాక్టర్ వెంకట్రామయ్య అన్నారు. శుక్రవారం వైద్య విధాన పరిషత్ ప్రభుత్వ ఆసుపత్రిలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి హెడ్‌నర్సు గ్లోరీ పూజలు చేసి నివాళులర్పించారు. ఆమె అందించిన వైద్య సేవలను కొనియాడారు. అందరికీ స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో డాక్టర్లు ఆశాలత, షబానా పాతిమా, నర్సులు మరియమ్మ, హెర్బియా, సుమతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి సంక్షేమ లబ్ధి



ప్రభుత్వ పథకాలపై ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

- ఎమ్మెల్యే నవాజ్‌బాషా
- 35వవార్డులో గడప గడపకు మన ప్రభుత్వం

మదనపల్లె : ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. శుక్రవారం పట్టణంలోని 35వ వార్డులో కౌన్సిలర్ ఎస్వీ రమణ ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే, మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకాచలపతి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నవాజ్‌బాషా 35వ వార్డులోని రాజానగర్‌లో ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల వివరాలను తెలియజేసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. వైఎస్సార్ సీపీ నాలుగేళ్ల పాలనలో ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. మంచి చేస్తున్న ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనపై ప్రజలంతా సంతృప్తిగా ఉన్నామని చెప్పడంతో రెట్టించిన ఉత్సాహంతో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమర్థవంతమైన పాలనతో దేశంలోనే రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నిలపడమే కాకుండా ప్రజలందరి ఆర్థిక స్థితిగతులు మెరుగుపరిచేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నారన్నారు. టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల చుట్టూ తిరిగినా అందని పథకాలు.. నేడు జగనన్న పాలనలో ఇంటి వద్దకే అందుతుండటంతో ప్రజలంతా వైఎస్సార్ సీపీనే అధికారంలో ఉండాలని కోరుకుంటున్నారన్నారు. మళ్లీ మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డినే చేస్తామని సంతోషంగా చెపుతున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల, ఏఈ స్నేహప్రియ, కౌన్సిలర్లు ఎం.వి.రమణ, మేస్త్రీ శ్రీనివాసులు, ఆర్.వి.శివారెడ్డి, రామిశెట్టి శివయ్య, రేణుక, వసీం, వైస్ ఎంపీపీ నందినితాజ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తట్టిశ్రీనివాసులురెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు శీలంరమేష్, బండిమనోహర్, చందూరెడ్డి, రహీం, రెడ్డిశేఖర్, ఎల్ఐసీ సుధాకర్, చరణ్, మునిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న అర్జున తపస్సు



అశేష భక్తజనుల మధ్య అర్జుని తపస్సు

పీలేరు రూరల్ : పీలేరు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గత పది రోజులుగా నిర్వహిస్తున్న మహాభారతయజ్ఞ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సాయంత్రం అర్జున తపస్సును భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మహాభారత యజ్ఞ ప్రాంతంలో తపస్మాన్ ఏర్పాటు చేశారు. ద్రౌపతి సమేత పాండవులు, శ్రీకృష్ణుని ఉత్సవ విగ్రహాలను ఆలయం నుంచి భక్తి శ్రద్ధలతో తపస్మాన్ వద్దకు తీసుకు వచ్చారు. తపస్మాన్ వద్ద అర్జునుడు, శివపార్వతుల వేషధారులు, యజ్ఞ నిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్జున వేషదారుడు కౌరవులపై విజయం సాధించడానికి శివున్ని మెప్పించి పశుపదార్థం సాధించే తపస్సు ఘట్టాన్ని కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. అర్జునుడు ఒక్కో మెట్టు ఎక్కుతూ పాడిన పద్యాలు భక్తులను కట్టిపడేశాయి. అర్జున వేషదారి తపస్మాన్ పైకి ఎక్కి అక్కడి నుంచి నిమ్మకాయలు, వివిధ రకాల పండ్లు, విబూది, మిఠాయిలు విసిరారు. అవి దక్కిన వారికి శుభం కల్గుతుందనే నమ్మకంతో భక్తులు వాటి కోసం పోటీ పడ్డారు. సంతానం లేని మహిళలు, కోర్కెలు కల్గిన భక్తులు తపస్మాన్ వద్ద వరపడ్డారు. అర్జున తపస్సు కార్యక్రమానికి ఉభయదారులుగా మోహనాచారి వ్యవహరించారు.

మాసాబీబీకి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



ఎమ్మెల్యేని సన్మానిస్తున్న సర్పంచ్ బాషా

పెద్దమండ్యం : కుషావతీ నది ఒడ్డున వెలసిన హజరత్ మహబూబ్ సుబహాని, హజరత్ మాసాబీబీ బావి వద్ద గురువారం రాత్రి తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉరుసు ఉత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యేకి మాసాబీబీ కమిటీ సభ్యులు, ముస్లింలు ఘనస్వాగతం పలికారు. స్థానిక సర్పంచ్ ఎస్.బాషా ఎమ్మెల్యేని సన్మానించారు. విద్యుత్ దీపాలంకరణలతో మాసాబీబీ బావి కళకళలాడింది. మిరుమిట్లు గొలిపే కాంతులు, శబ్దాలతో ప్రత్యేక బాణాసంచాతో, బళ్లారి వారి డ్రమ్స్ వాయిద్యాలతో గంధం ఊరేగింపు అత్యంత వైభవంగా జరిగింది. కలిచెర్ల సింగిల్ విండో చైర్మన్ కడప సుధాహరరెడ్డి మాసాబీబీ బావి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉరుసు ఉత్సవం సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ వినోద్‌కుమార్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సోదనపల్లె బాషా, ఎంపీటీసీ జయరాం ,మాజీ ఎంపీటీసీ షంషాద్‌బీ, నాయకులు గుర్రం రమేష్, కోసూరి రామక్రిష్ణ, సర్పంచ్ విశ్వనాథరెడ్డి, మాజీ సర్పంచ్ విజయకుమార్ పాల్గొన్నారు.